క్లుప్తంగా

అక్రమ మైనింగ్‌పై సీఎం కార్యాలయంలో ఫిర్యాదు

కేవీపల్లె : మండలంలోని అడవిపల్లె రిజర్వాయర్ సమీపంలో అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్. వెంకటేష్ సోమవారం రాష్ట్ర సచివాలయం(సీఎం ఆఫీసు)లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవిపల్లె రిజర్వాయర్‌కు సమీపంలో మైనింగ్ మాఫీయా జనరేటర్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, మందు సామాగ్రి ఉపయోగించి రాళ్లు పేల్చుతున్నారని తెలిపారు. మైనింగ్ మాఫీయాపై ఇది వరకే అన్నమయ్య జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందని, అయితే మైనింగ్ ఏడీ సుబ్రమణ్యం మైనింగ్ మాఫీయాతో చేతులు కలిపారని ఆరోపించారు. అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకుని పరిసర ప్రాంత గ్రామ ప్రజలకు, అడవిపల్లె రిజర్వాయర్‌కు నష్టం కలగకుండా చూడాలని కోరినట్లు తెలిపారు.

విశ్వనాథరెడ్డి మృతికి సంతాపం


విశ్వనాథరెడ్డి (ఫైల్)

కురబలకోట: మండల వైఎస్సార్ సీపీ నాయకుడు జంగావారిపల్లెకు చెందిన వి. విశ్వనాథరెడ్డి (66) సోమవారం మృతి చెందాడు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. బెంగళూరు ఆసుపత్రిలో చికిత్స పొందతూ సోమవారం మృతి చెందారు. స్వగ్రామం జంగావారిపల్లెలో ఘనంగా అంత్యక్రియలు నిర్వహించారు. ఇతను విద్యా రత్నంగా కూడా పేరు పొందారు. జంగావారిపల్లె వద్ద శ్రీ విద్యా నిలయం పేరుతో హైస్కూల్ నిర్వహించారు. ఆదర్శ రైతుగా కూడా పేరు పొందారు. పార్టీకి నిస్వార్థ సేవలు అందించారు. ఆయన ఆకస్మిక మృతి పట్ల స్థానిక ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, మాజీ జెడ్పీటీసీ కె.హరినాథ రెడ్డి, స్థానిక సర్పంచ్ ఆర్కే కృష్ణారెడ్డితో పాటు పార్టీలకు అతీతంగా పలువురు నాయకులు సంతాపం తెలిపారు.

మల్లయ్యకొండకు పోటెత్తిన భక్తులు


స్వామివారి అలంకరణ

తంబళ్లపల్లె: మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జున స్వామికి ప్రత్యేక అలంకరణ చేసి అభిషేకాలు చేశారు. స్వామి వారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. దేవాలయం తరపున భక్తులకు అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో ఈఓ మునిరాజ, కొండ కిట్ట తదితరులు పాల్గొన్నారు.

పక్కా ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ దిలీప్‌కుమార్

తంబళ్లపల్లె: మండలంలో పక్కా ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎంపీడీఓ ఉపేందర్‌రెడ్డి, ఈఓపీఆర్డీ దిలీప్‌కుమార్ కోరారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సంఘమిత్రలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇప్పటికే పునాదులు పూర్తి చేసిన లబ్ధిదారులను ఒప్పించి వారికి వెలుగు పథకం ద్వారా ఆర్థిక సహాయం అందించి పనులు చేసుకునే విధంగా ప్రోత్సహించాలన్నారు. అందరూ సమష్టిగా కృషి చేసి అనుకున్న లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. పనులకు సకాలంలో బిల్లులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అప్పుడే లబ్ధిదారులకు నమ్మకం పెరిగి పనులు పూర్తి చేసుకుంటారన్నారు. సమావేశంలో ఏపీఎం గంగాధర్, హౌసింగ్ ఏఈ సుజాత, ఎంఎస్ అధ్యక్షురాలు రామలక్ష్మి, సీసీలు పాల్గొన్నారు.

సంఘమిత్రగా కొనసాగించాలని వినతి

నిమ్మనపల్లె : హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను వెంటనే అమలు చేసి, తనను సంఘమిత్రగా కొనసాగించాలని నిమ్మనపల్లె మండలం అగ్రహారం పంచాయతీ, చైతన్య వీఓ సంఘమిత్రగా పనిచేసిన పి.మాధవి సోమవారం ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డిని వీఓ సభ్యులతో కలసి వినతి పత్రం అందజేసింది. 2021 నుంచి సంఘమిత్రగా ఎటువంటి పొరపాట్లు, ఆరోపణలు లేకుండా సక్రమంగా విధులు నిర్వహించానన్నారు. అయితే ఇటీవల నిరాధార ఆరోపణలతో తనను తొలగించారని, పలుమార్లు అధికారుల వద్దకు వెళ్లి మొరపెట్టుకున్న తనకు న్యాయం జరగలేదన్నారు. దీంతో విధిలేని పరిస్థితుల్లో న్యాయం కోసం హైకోర్టును ఆశ్రయించానన్నారు. సమస్యను విచారించిన హైకోర్టు తనను సంఘమిత్రగా విధులు కొనసాగించేలా ఆదేశాలు ఇస్తూ తీర్పునిచ్చిందన్నారు. హైకోర్టు ఆదేశాలకు సంబంధించిన ప్రతులను అధికారులకు అందించానన్నారు. అయినా ఇంతవరకు తన విధుల్లోకి తీసుకోలేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి తనకు న్యాయం చేసి విధులలోకి తీసుకుని సంఘమిత్రగా కొనసాగించాలని విన్నవించింది. హైకోర్టు ఆదేశాలకు సంబంధించిన ప్రతులను ఎంపీడీఓకు అందజేసింది.

మూయని పైకప్పు..
ప్రమాదం జరిగితేనేనా కనువిప్పు


కాలువ పనులు అర్థాంతరంగా వదిలేసి పైకప్పు వేయని దృశ్యం


ప్రమాదకరంగా ఉన్న కాలువను చూపుతున్న వ్యాపారులు, ఆటో కార్మికులు

- ప్రమాదకరంగా ముగుగు కాలువలు
- అసంపూర్తి పనులతో వదిలేస్తారా?
- దుకాణదారులు, ప్రజలకు తప్పని అవస్థలు

పీలేరు : పీలేరు పట్టణంలో మురుగునీటి కాలువల కోసం పలు చోట్ల జేసీబీతో తవ్వేసి అనంతరం పనులు పూర్తి చేయకుండా వదిలేయడంతో వాహన చోదకులు, ప్రయాణికులు, స్థానిక దుకాణదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనుల అర్థాంతరంగా వదిలేసి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పంచాయతీ అధికారుల తీరుపై స్తానికులు మండి పడుతున్నారు. ప్రధానంగా ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఎల్‌బీఎస్ రోడ్డులోనూ, తిరుపతి రోడ్డు మార్గంలో మురుగునీటి కాలువలను శుభ్రం చేసే క్రమంలో పంచాయతీ వారు కాలువ పైకప్పు తొలగించి, మట్టిని తొలగించారు.

కాలువలో పడితే బాధ్యులు ఎవరు?

పనులు చేపట్టి నెల కావస్తున్నా కాలువలు పైకప్పు పనులు చేపట్టలేదు. దీంతో దుకాణ దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రమాదవశాత్తూ కాలువలో పడితే బాధ్యులు ఎవరని ప్రశ్నిస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే రోడ్లపై చిన్నారులు, వృద్ధులు, మహిళలు తిరుగుతూ ఉంటారు. కాలువ అవతలి వైపు వెళ్లాలంటే కట్టేలు.. రేకులు వేసుకొని వెళుతున్నారు. కాలువ దాటే సమయంలో కాలుజారితే కాలువలోకే వెళ్లాల్సి ఉంటుంది.

తమ వ్యాపారం ఎలా?

వేలకు వేలు దుకాణాలకు అద్దెలు చెల్లిస్తున్నామని, ఇలా అర్థాంతరంగా పనులు ఆపేస్తే తమ వ్యాపారం ఎలా చేసుకోవాలని ప్రశ్నిస్తున్నారు. మరోవైపు కాలువలు దుర్వాసన వెదజల్లుతుండడంతో వినియోగదారులు కూడా ఎవరూ రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి కాలువల నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

వ్యాపారాలు జరగడం లేదు



బస్టాండ్ సమీపంలో ఆర్టీసీ రూములో అద్దెకు ఉంటూ పండ్ల వ్యాపారం నిర్వహించుకుంటున్నా. కాలువ పనులు చేపట్టి నెలకు పైగా అవుతోంది. అర్థాంతరంగా ఆపేసారు. దీంతో కాలువ దాటి ఎవరూ పండ్లు కోసం రావడం లేదు. సుమారు 40 వేలు అద్దె చెల్లించాల్సి వస్తోంది. వ్యాపారం లేకపోతే ఎలా అద్దె కట్టాలి.

-అమానుల్లా, పండ్ల వ్యాపారి

దుర్గంధం భరించలేకున్నాం



కాలువలు తవ్వేసి అర్థాంతరంగా పనులు ఆపేయడంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఎల్‌బీఎస్ రోడ్డు నుంచి బస్టాండు ప్రాంగణం వరకు ఎటు చూసినా దుర్గంధం వెదజల్లుతోంది. అటు పంచాయతీ అధికారులు కానీ, ఆర్టీసీ అధికారులు గానీ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

- రమేష్, సెలూన్ షాప్ నిర్వాహకుడు

పేదల కాలనీల్లో వసతులు కల్పించండి

పీజీఆర్ఎస్‌లో సబ్ కలెక్టర్‌కు వినతి


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె : మదనపల్లె మండలం కోళ్లబైలు పంచాయతీలో పేదలు నివసించే ఇందిరమ్మకాలనీ, బయ్యారెడ్డి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని ఆలం యూత్ కమిటీ సభ్యులు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు విన్నవించారు. సోమవారం సబ్ కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. కోళ్లబైలు పంచాయతీలోని పేదల కాలనీల్లో రోడ్డు సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో ఆపద సమయాల్లో అంబులెన్స్‌లు రాలేక ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఉందని తెలిపారు. డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో మురికినీరు ఇళ్ల మధ్యనే ప్రవహిస్తూ, దోమలు, విషపురుగులకు నెలవై, కాలనీవాసులు అనారోగ్యాల బారిన పడుతున్నారని, 16 ఏళ్లుగా తమ అవసరాలను పట్టించుకున్న దిక్కులేదని వాపోయారు. పట్టాదారు పాసుపుస్తకాలు లేనందున తాతల కాలం నుంచి అనుభవంలో ఉన్న తమ భూమిని కొలిచి హద్దులు చూపించేందుకు సర్వేయర్ నిరాకరిస్తున్నాడని, తనకు న్యాయం చేయాల్సిందిగా కోరుతూ వెంకప్పకోటకు చెందిన టి.గంగులప్ప అర్జీ సమర్పించారు. హంద్రీనీవా కాలువకు స్వాధీనం చేసుకున్న భూమికి సంబంధించి రావాల్సిన నష్టపరిహారం రూ.46లక్షల25వేల 648 రూపాయలు, ఏడేళ్లు కావస్తున్నా ఇప్పటివరకు ప్రభుత్వం మంజూరుచేయలేదని టంగుటూరు ప్రకాశంపంతులు, విశ్వనాథంలు అర్జీ సమర్పించారు. తమకు రావాల్సిన పరిహారం పైకాన్ని వడ్డీతో సహా చెల్లించాల్సిందిగా కోరారు. పట్టణంలోని బాలబాలికల ప్రభుత్వ వసతి గృహాల వద్ద ఆకతాయిల బెడద అధికంగా ఉందని, పోలీస్ సెక్యూరిటీ కల్పించాలని కోరినా అధికారులు స్పందించడం లేదని ఏఐఎస్ఎఫ్ జిల్లా బాలికల కన్వీనర్ ఎస్.గంగాదేవి వినతిపత్రం సమర్పించింది.

క్షేత్ర పర్యటనతో కొత్త మెలకువలు


వ్యవసాయ ప్రదర్శనలు పరిశీలిస్తున్న ఏడీఏ వై.వి. రమణరావు

పీలేరు రూరల్ : వ్యవసాయంపై విద్యార్థులకు క్షేత్ర పర్యటనతో కొత్త మెలకువలు తెలుస్తాయని పీలేరు ఏడీఏ వై.వి. రమణరావు అన్నారు. సోమవారం మండలంలోని బాలంవారిపల్లెలో కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మహానంది వ్యవసాయ కళాశాల విద్యార్థులు క్షేత్ర స్థాయిలో మూడు నెలల పాటు శిక్షణ పూర్తి చేసి సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక యాంత్రీకరణను వ్యయసాయానికి అనుసంధానం చేసుకుంటే ఆశించిన ఫలితాలు ఉంటాయన్నారు. వ్యవసాయంలో నూతన పద్ధతులు, డ్రోన్ వినియోగం, జీవ శిలీంద్రాశినీలను వాడకం ముందుకు తీసుకెళ్లాలని కోరారు. తక్కువ ఖర్చు తో అధిక దిగుబడులు సాధించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ కె. మంజుల, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వై. పవన్‌కుమార్‌రెడ్డి, శాస్త్రవేత్తలు సోమశేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా మున్సిపల్ పార్కుల నిర్వహణ

– బహుజనయువసేన అధ్యక్షులు పునీత్


మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న బీవైఎస్ నాయకులు

మదనపల్లె : ఆహ్లాదానికి, ప్రశాంతతకు నెలవుగా ఉంటూ పచ్చదనంతో కళకళలాడాల్సిన మున్సిపల్ పార్కులు, నిర్వహణ అధ్వానంగా ఉందని బహుజన యువసేన అధ్యక్షులు పునీత్ ఆరోపించారు. పార్కుల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని కోరుతూ సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. మున్సిపల్ మేనేజర్ మనోహర్‌కు అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా పునీత్ మాట్లాడుతూ..పట్టణ ప్రజలను వాయుకాలుష్యం నుంచి కాపాడేందుకు, ఉదయం, సాయంత్రం వేళల్లో పిల్లలతో ఆహ్లాదంగా గడిపేందుకు మున్సిపల్ పార్కులను ఏర్పాటుచేయడం జరుగుతుందన్నారు. పట్టణంలోని రాంనగర్ పార్క్, బాపూజీపార్క్, రామారావుకాలనీ మున్సిపల్ పార్కు సిబ్బంది సక్రమంగా పట్టించుకోకపోవడంతో పాడైపోయి నిరుపయోగంగా తయారయ్యాయన్నారు. కొంతమంది యువత పార్కులను అసాంఘిక కార్యకలాపాలకు వినియోగించుకుంటున్నారన్నారు. వీటిపై పలుమార్లు ప్రజలు ఫిర్యాదుచేసినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. మున్సిపల్ అధికారులు ఈ విషయంలో చొరవ చూపి పార్కులకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తేవాలన్నారు. కార్యక్రమంలో బీవైఎస్ నాయకులు శ్రీనివాసులు, ఆది, శశికుమార్, వినయ్, శివకుమార్, తారక్, ఉదయ్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

చింతచెట్ల ఫలసాయం వేలం

తంబళ్లపల్లె: ఆర్అండ్‌బీ రోడ్ల పక్కనున్న చింత చెట్ల ఫలసాయానికి ఈనెల 31వ తేదీన వేలం నిర్వహించనున్నట్లు ఆర్అండ్‌బీ ఏఈ బుర్రయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మదనపల్లె ఆర్అండ్‌బీ కార్యాలయ శాఖలో తంబళ్లపల్లె సెక్షన్ ఆఫీసు వద్ద వేలం నిర్వహిస్తామన్నారు. ముదివేడు, తంబళ్లపల్లె, పెద్దమండ్యం రోడ్డు పక్కన ఉన్న చింతచెట్లతో పాటు నిమ్మనపల్లె, వాల్మీకిపురం, గుర్రంకొండ, గాలివీడు రోడ్డు, ములకలచెరువు తంబళ్లపల్లె రోడ్డు, కొటాల-నల్లగుట్టపల్లె రోడ్డు, గొల్లపల్లె-కోసువారిపల్లె-ముదివేడు రోడ్లకు ఇరువైపులా ఉన్న చింతచెట్ల ఫలసాయంకు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు.

క్రిస్మస్‌కు ప్రార్థన మందిరాలు ముస్తాబు

రామసముద్రం : మండలంలో క్రిస్మస్ వేడుకలకు ప్రార్థన మందిరాలు ముస్తాబవుతున్నాయి. మండలంలోని పెనుమోలు ప్రార్థన మందిరం, ప్రేమ స్వరూపి ప్రార్థన మందిరం, బేతస్త, బేతేలు, సియోన్, ఏసుక్రీస్తు వందల ఏళ్ల నాటి చరిత్ర కలిగిన కర్ణాటక బార్డర్‌లో ఉన్న గూకుంట గ్రామంలో వెలసి ఉన్న సాంటా ఫ్రాన్సిస్ క్లేవియర్ చర్చిలను విద్యుత్ దీపాలంకరణ చేశారు. గడ్డితో పాక నిర్మించి విగ్రహాలను ఏర్పాట్లు చేశారు. గూకుంట చర్చికి ఇతర రాష్ట్రాల నుంచి ప్రార్థన మందిరానికి వస్తారని గ్రామస్థులు తెలిపారు.

ఘనంగా త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు

మదనపల్లె సిటీ: మదనపల్లెలో సోమవారం శ్రీ సద్గురు త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయం వద్ద త్యాగరాజస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. అక్కడి నుంచి ర్యాలీగా టీటీడీ కళ్యాణ మండపం వరకు నిర్వహించారు. టీటీడీ కళ్యాణ మండపంలో వాయిద్యాకారులు కన్నన్, ఆనంద్, గోవిందరాజన్, రాధాకృష్ణన్‌లచే గొప్ప నాదస్వర కచేరి నిర్వహించారు. నాయిబ్రాహ్మణ సంఘ అధ్యక్షులు సుబ్రమణ్యం, కార్యదర్శి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

117 చౌకదుకాణాలకు 709 దరఖాస్తులు

మదనపల్లె : మదనపల్లె డివిజన్‌లో ఖాళీగా ఉన్న 117 చౌకదుకాణాల డీలర్ల నియామకాలకు సంబంధించి 709 దరఖాస్తులు అందాయని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ సోమవారం తెలిపారు. డివిజన్‌లో మండలాల వారీగా రేషన్‌షాపులకు అందిన దరఖాస్తులను పరిశీలిస్తే...మదనపల్లె మండలంలోని 44 ఖాళీలకు 381 దరఖాస్తులు, బి.కొత్తకోట 6 ఖాళీలకు 83, కలికిరి 15 కు 23, కురబలకోట 6కు 32, ములకలచెరువు 5 కు 22, నిమ్మనపల్లె 6 కు 23, పెద్దమండ్యం 2 కు 6, పెద్దతిప్పసముద్రం 5 కు 22, రామసముద్రం 5 కు 50, తంబళ్లపల్లె 4 కు 9, వాల్మీకిపురంలో 19 ఖాళీలకు 58 దరఖాస్తుల చొప్పున మొత్తం 709 దరఖాస్తులు అందాయన్నారు. వీరికి ఈనెల 28న 80 మార్కులకు రాతపరీక్ష ఉంటుందని, అందులో అర్హత సాధించిన అభ్యర్థులకు 30, 31 తేదీల్లో 20 మార్కులకు ఇంటర్వ్యూ ఉంటుందన్నారు.

• నవ్వుతారు

ఏ రోడ్డు మరమ్మతుందో ఆ రోడ్డుకు అలాగే మరమ్మతులు చేయించడం చూస్తుంటాం. అయితే కూటమి ప్రభుత్వంలో ఏ రోడ్డయినా సరే తారుతో ప్యాచ్‌లు వేసేస్తున్నారు. ప్రభుత్వం రోడ్లకు మరమ్మతులు చేయిస్తోంది. అందులో భాగంగా బి.కొత్తకోట పోలీస్‌స్టేషన్ సమీపంలో మదనపల్లె రహదారిపై 2016లో సిమెంటురోడ్డు వేశారు. ఏడాది క్రితం రోడ్డుపై రెండు వైపులా చీలిపోయింది. అయితే ప్రస్తుతం దెబ్బతిన్న ఈ సిమెంటురోడ్డుపై తారుపోసి చీలిన రోడ్డుకు మరమ్మతులు చేయించారు. రహదారి భవనాలశాఖ అధికారులు ఇంజినీర్లే కాబట్టి సిమెంటురోడ్డుపై తారుతో మరమ్మతులు చేయించొచ్చు లేదో వారికే తెలియాలి.

-బి.కొత్తకోట


సిమెంటురోడ్డుకు తారుపోసి చేసిన మరమ్మతులు

ప్రధాన కాలువకు కృష్ణా జలాలు

- పెండింగ్ పనుల పూర్తికి రూ.600 కోట్లతో ప్రతిపాదన
- ఎస్ఈ రాజగోపాల్


పెద్దపల్లి వద్ద కాలువకు సంబంధించిన మ్యాప్ పరిశీలిస్తున్న ఎస్ఈ రాజగోపాల్

కేవీపల్లె: హంద్రీనీవా ప్రధాన కాలువ ద్వారా అడవిపల్లి, శ్రీనివాసపురం రిజర్వాయర్లకు కృష్ణా జలాలు తరలించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ప్రాజెక్టు ఎస్ఈ సీఆర్ రాజగోపాల్ అన్నారు. సోమవారం ఆయన సాంకేతిక అధికారులతో కలిసి మండలంలోని పెద్దపల్లె గ్రామంలో సాగే ప్రధాన కాలువ కిలోమీటర్ 546 నుంచి కిలోమీటర్ 554 వరకు పరిశీలించారు. ఈ కాలువలో అసంపూర్తి నిర్మాణాలు, చేపట్టాల్సిన కాంక్రీటు పనులు, స్ట్రక్చర్స్ పనులపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. ఈ కాలువకు 175 మీటర్ల దూరంలోనే అడవిపల్లి రిజర్వాయర్ ఉంది. ప్రధాన కాలువ ద్వారా ప్రవహించే నీళ్లు రిజర్వాయర్‌లోకి చేరుతాయి. ఈ నీటి ప్రవాహం అడ్డంకులు లేకుండా సాగేలా చేసేందుకు అవసరమైన అన్ని పనులు చేపట్టి పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టినట్టు రాజగోపాల్ చెప్పారు. ప్రధాన కాలువకు సంబంధించిన జరగాల్సిన పెండింగ్ పనులకు రూ.600 కోట్లు అవసరమని ప్రాథమికంగా అంచనావేశామని, తుది నివేదికను సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. ప్రతిపాదనలకు ప్రభుత్వ ఆమోదం లభించగానే త్వరితగతిన పనులు చేపట్టి పూర్తి చేస్తామని, ఆ తర్వాత చిన్నమండెం మండలంలోని శ్రీనివాసపురం రిజర్వాయర్, అడివిపల్లి రిజర్వాయర్‌కు కృష్ణా జలాలను తరలిస్తామని చెప్పారు. ఈ పరిశీలనలో భాగంగా అడివిపల్లి రిజర్వాయర్ నుంచి మొదలయ్యే 120 కిలోమీటర్ల సాగే నీవా బ్రాంచ్ కెనాల్‌ను పరిశీలించారు. ఈ కాలువలోకి కృష్ణా జలాలు ప్రవహించాక దీనికింద ఆయకట్టు భూములు సాగులోకి వస్తాయని చెప్పారు. ఈ పరిశీలనలో ప్రాజెక్టు ఈఈ ఎస్.గణేనాయక్, డీఈఈ ఎస్‌వీఎల్‌పీ.రమణరావు, ఎఈఈ పీ.మోహన్ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు స్థలం కేటాయింపు


ఏపీ గురుకుల పాఠశాల స్థలంలో బోర్డులు ఏర్పాటు చేసిన అధికారులు

గుర్రంకొండ: ఏపీ గురుకుల బాలికల పాఠశాల భవన నిర్మాణాలకు గతంలో కేటాయించిన స్థలంలో అధికారులు బోర్డులు ఏర్పాటు చేశారు. గత పదిహేను సంవత్సరాలుగా గురుకుల పాఠశాల అద్దెభవనాల్లో నిర్వహిస్తున్నారు. గతంలో పలుమార్లు భవన నిర్మాణాలకు అవసరమైన నిధులు రూ.10 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే ఏళ్ల తరబడి పాఠశాల నిర్మాణానికి అవసరమైన స్థలం అధికారులు చూపించలేక పోయారు. గత ఏడాది చిట్టిబోయనపల్లె రెవెన్యూ గ్రామంలో సర్వేనెంబర్లు 6/4,6/5 లలో 4.85 ఎకరాలను సర్వే చేశారు. సర్వేచేసి సదరు స్థలాన్ని గురుకుల నిర్మాణాలకు కేటాయిస్తూ రెవెన్యూ అధికారులు జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపారు. సదరు ప్రభుత్వ స్థలాలను కొంతమంది కబ్జాచేసేందు ప్రయత్నించారు. ఈనేపథ్యంలో సోమవారం పంచాయతీ ఈవో శ్రీహరి, వీఆర్వో భరత్‌కుమార్ లు స్థలం వద్దకు చేరుకొని ప్రభుత్వ బోర్డులు నాటించారు. ఈ స్థలం ఏపీగురుకుల పాఠశాల భవన నిర్మాణాలకు కేటాయించారని, ఇందులో ఎవరైన ప్రవేశిస్తే చట్టపరంగా చర్యలు తీసుకొంటామనిహెచ్చరిస్తూ బోర్డులు ఏర్పాటు చే శారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి నిస్సార్, సర్వేయర్లు, చాందినీ, గౌసియా పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని ధర్నా


పెండింగ్ వేతనాలు చెల్లించాలని ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

మదనపల్లె : మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య దినసరి వేతన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న రెండునెలల వేతనాలు తక్షణమే చెల్లించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సురేష్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ కుమార్ మాట్లాడుతూ క్రిస్మస్, నూతన సంవత్సరాది పండుగల రోజున వేతనాలు లేకుండా కార్మికులు పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఉందన్నారు. పట్టణంలో ప్రజలకు అంటురోగాలు ప్రబలకుండా ప్రతిరోజు క్రమం తప్పకుండా పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులకు ప్రతి నెలా మొదటి వారంలోనే జీతాలు చెల్లించడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారని ఆరోపించారు. అధికారులు తక్షణమే స్పందించి కార్మికులకు వేతనాలు చెల్లించాలని, పట్టణ జనాభా రోజు రోజుకీ పెరుగుతున్న సందర్భంలో కార్మికుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. కరోనా సమయంలో పని చేసిన కార్మికులని ఆప్కాస్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ.మస్తాన్, ఉపాధ్యక్షురాలు. ఇంద్రాణి. మున్సిపల్ వర్కర్స్ యూనియన్. నాయకులు వంశీ, శ్రీనివాసులు. శేఖర. రేణుక. అనురాధ. రెడ్డమ్మ. లక్ష్మీదేవి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభం

– విద్యుత్ శాఖ ఏఈ నాగరాజు


స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రారంభిస్తున్న ఏఈ నాగరాజు, సిబ్బంది

నిమ్మనపల్లె: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో విద్యుత్ శాఖ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియను చేపట్టినట్లు మండల విద్యుత్ శాఖ ఏఈ నాగరాజు తెలిపారు . సోమవారం నిమ్మనపల్లి విద్యుత్ ఉపకేంద్రం వద్ద స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏఈ నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో పాత మీటర్ల స్థానంలో కొత్తగా స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మొదట విడతలో ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య, వ్యాపార, దుకాణా సముదాయాల్లో కొత్త స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రెండవ విడతలో గృహాలకు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తామన్నారు. వినియోగదారులు స్మార్ట్ మీటర్ల ద్వారా వారి అవసరాన్ని బట్టి విద్యుత్తు ఉపయోగించుకోవచ్చునన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో లైన్ ఇన్స్పెక్టర్ చక్రపాణి, టీమ్ లీడర్ హరి, శివ, తదితరులు పాల్గొన్నారు.

విశ్వమంతా గణితమయమే


శ్రీనివాస రామానుజన్ చిత్ర పటం వద్ద నివాళి అర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు


కలకడ: రామానుజన్ చిత్రం వద్ద నివాళి అర్పిస్తున్న హెచ్‌ఎం, విద్యార్థులు

కురబలకోట: విశ్వమంతా గణితంతో ముడిపడి నడుస్తుందని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల గణిత శాస్త్ర విభాగాధిపతి రమేష్ రెడ్డి అన్నారు. జాతీయ లెక్కల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మనిషి పుట్టుక మొదలుకుని చివరకు చావు వరకు అన్నీ లెక్కల మయమేనన్నారు. లెక్కలు లేని సమాజాన్ని ఊహించలేమన్నారు. మానవ జీవితానికి లెక్కలతో విడదీయరాని అనుబంధం ఉందన్నారు. గణితమంటే మొదట శ్రీనివాసరామానుజన్ పేరు గుర్తుకు వస్తుందన్నారు. అంతలా ఆయన గణితంలో ప్రాచుర్యం పొందారన్నారు. గణితం విద్యార్థుల భవిష్యత్తుకు అద్వితీయంగా పనిచేస్తుందన్నారు. దీనికి చిన్ననాటి నుంచి అధిక ప్రాముఖ్యత నిస్తూ గణితంలో రాణించాలన్నారు. లెక్కల పట్ల భయాన్ని వీడి ఆసక్తిని పెంచుకుని జీవితాన్ని సుస్థిరం చేసుకోవాలన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గణిత మేధావి శ్రీరామానుజన్

కలకడ : ప్రపంచ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ అని కోన క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు మోడెమ్ చెంగల్‌రాయుడు అన్నారు. సోమవారం స్థానిక పాఠశాలలో గణిత దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులు చిత్రీకరించిన రామానుజన్ చిత్రపటానికి పూజలు చేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రపంచ గణిత మేధావుల్లో రామానుజన్ ఒకరుగా గుర్తింపు పొందారని గుర్తు చేశారు. విద్యార్థులు గణితంపై మక్కువ పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు నాగమణినాయక్, ఉపాధ్యాయులు కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

పీలేరు రూరల్ : సమస్యల పరిష్కారం కోసం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజరు బి.కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం డిపో కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

IndusInd Bank - CFD
COMMERCIAL VEHICLES FOR SALE
ASHOK LEYLAND 1920/51 FBL
2022 MODEL AP39 UK 5789
Engine No : NLEZ402919
Chassis No : MB1A5RHD7NEKH3940
Cell: 99594 47319
16-611-1, 3rd Floor, Sri Raghavendra Complex, Punganur Road, MADANAPALLI.